

హైదరాబాద్‌లో సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి, టీ.ఆర్‌.ఆర్



కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి మొక్కను అందిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, శిక్షణ కలెక్టర్ ఉమాహారతి – న్యూస్‌టుడే, కొడంగల్.

బకాయి బిల్లులు అందించండి

కొడంగల్, న్యూస్‌టుడే: ఈ-కుబేర్‌లో ఉన్న బకాయి బిల్లులు (పింఛనుదారులకు రావాల్సిన గ్రాట్యుటీ కమ్యుటేషన్, ఈఎల్స్, జీపీఎఫ్) అలాగే సర్వీస్ ఉపాధ్యాయుల బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయులు సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఆదివారం వారు ఆయనను కొడంగల్‌లో కలిసి ఈ మేరకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పాపిరెడ్డి, ఆశప్ప, వడ్ల గోపాల్, టి.రాములు, ఉపాధ్యాయులు బాకారం మల్లయ్య, హకీం బాల్‌రాజ్, మొగులప్ప తదితరులు ఉన్నారు.

రాడార్ కేంద్ర శంకుస్థాపన పనుల పరిశీలన


పరిగి, పూడూరు, న్యూస్‌టుడే: పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ కేంద్రం పనులను ఆదివారం ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈనెల 15న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన పనులకు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. వీరితోపాటు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారు. పలు ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నేవీ అధికారులతో చర్చించారు. వర్షం వస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

రెండేళ్లలో అభివృద్ధి ఎట్లుంటుందో చూపిస్తా

తాండూరు: రానున్న రెండేళ్లలో తాండూరు నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఎట్లుంటుందో చూపిస్తానని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చెప్పారు. ఆదివారం క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గడచిన పదేళ్ల పాటు అధికారంలో ఉన్న నాయకులు రహదారుల గురించి పట్టించుకోలేదు. నాకు రెండేళ్ల సమయం ఇవ్వండి అన్ని సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. జడ్పీటీసీ, డీసీసీబీ ఛైర్మన్ పదవిని పారదర్శకంగా నిర్వహించాను. ప్రస్తుతం ఎమ్మెల్యే పదవిని కూడా పారదర్శకంగానే నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఎక్కడా అవినీతికి చోటు ఇవ్వనని, కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటానని తెలిపారు. నియోజక వర్గ అభివృద్ధికి శ్రమిస్తానన్నారు.

సౌకర్యాల కల్పన.. రైతన్నకు సాంత్వన

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యల పరిష్కారమే కీలకం



ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నాహక చర్యలు చేపట్టింది. మిగతా జిల్లాల కంటే వికారాబాద్ జిల్లాలో వరి పంట 20 రోజుల ఆలస్యంగా చేతికొస్తుంది. ప్రభుత్వ ఆదేశాలతో అన్నదాతలు దళారులను ఆశ్రయించకుండా ఈనెల 3వ వారంలో కేంద్రాల ఏర్పాటుకు జిల్లా పౌర సరఫరాల శాఖ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కేంద్ర మద్దతు ధరను చెల్లించేలా చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే మద్దతు ధరల గోడ పత్రికలను జిల్లా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేశారు. ధాన్యం ముందుగా వచ్చే మండలాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఆయా కేంద్రాల వద్ద రైతులకు ఎదురైన సమస్యలు, కేంద్రాల్లో ఏర్పాటుచేయాల్సిన సౌకర్యాలపై కథనం.

మద్దుతు ధరలు... (రూ.క్వింటాలుకు)
- ఎ గ్రేడ్ రకం.. 2320
- సాధారణ రకం.. 2300
- సన్నరకానికి బోనస్ రూ.500

ఖరీఫ్ సాగు.. (ఎకరాలు)
- సాధారణ.. 99,000
- సాగైంది.. 85,000
- దిగుబడి అంచనా.. లక్ష మెట్రిక్ టన్నులు

దెబ్బతీసిన వర్షాలు

జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఈసారి ఖరీఫ్‌కు సంబంధించి వర్షాలు సకాలంలో కురవలేదు. రైతులు బోర్లు, బావుల కింద పండించేందుకు యత్నించారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన అకాల భారీ వర్షాలతో పలుచోట్ల తెగుళ్లు సోకాయి. ఫలితంగా గతంలో కంటే దిగుబడి తగ్గనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి 107 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 100 శాతం మేర ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు.

జిల్లా లో మొత్తం 107 కేంద్రాలు


విభాగం	సంఖ్య
ఐకేపీ	21
పీఏసీఎస్	62
డీసీఎంఎస్	22
ఎఫ్‌పీఓ	2

సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఏర్పాటు

ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం విక్రయానికి రాకుండా సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించాం.
– లింగ్యానాయక్, అదనపు కలెక్టర్.

ఇలా చేయాలి
- కొనుగోలు కేంద్రాల వద్ద మంచినీటి సదుపాయం కల్పించాలి.
- తూకాల్లో మోసాలను అరికట్టాలి.
- నిర్దేశించిన దానికంటే ఎక్కువ మొత్తంలో తూకం వేయకూడదు.
- కేంద్రం వద్ద ధాన్యం బస్తాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూడాలి.
- అవసరమైతే రక్షణ కోసం టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి.
- గన్నీ బస్తాల కొరత ప్రతిసారీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. డిమాండ్‌కు సరిపడా పంపిణీ చేయాలి.
- ధాన్యం విక్రయించిన అనంతరం కనీసం 48గంటల్లో ఖాతాల్లో నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి.
- విక్రయాల్లో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కేంద్రాల వద్ద ఏఈఓలు అందుబాటులో ఉండాలి.

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్, పరిగి



స్వామివారి పల్లకీ మోస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు



తాండూరులో శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవెంకటేశ్వరుడు



మహిషాసురమర్దిని రూపంలో శివుడు



కొడంగల్‌లో..

ఊరూరా దసరా... జనమంతా సరదా!



నవాంద్గీలోని కాగ్నానది వద్ద దుర్గామాతకు మహిళల హారతి

న్యూస్‌టుడే, తాండూరు టౌన్, కొడంగల్, వికారాబాద్

మున్సిపాలిటీ, తాండూరు గ్రామీణ, దోమ, బషీరాబాద్, పరిగి, వికారాబాద్ టౌన్: జిల్లాలో దసరా ఉత్సవాలు శని, ఆదివారాల్లో వైభవంగా సాగాయి. వికారాబాద్ బుగ్గ శ్రీ రామలింగేశ్వర ఆలయానికి ఎంతో విశిష్టత ఉందని మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్వామివారిని అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. తాండూరు మండలం చంద్రగిరిలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవెంకటేశ్వర ఆలయంలో స్వామివారికి అశ్వవాహన సేవను ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని సేవ చేశారు.
- పరిగి పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సిద్ధాంతి పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించిన శమీ పూజలో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పాల్గొన్నారు. వికారాబాద్‌లోని ఆలంపల్లిలోని శ్రీ అనంత పద్మనాభ స్వామివారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి పట్టు వస్త్రాలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమర్పించారు.



పరిగిలో దహనమవుతున్న రావణాసురుడు

గృహ లబ్ధికి ఇందిరమ్మ కమిటీలు

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్, పరిగి: నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు సర్కారు చర్యలు చేపడుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజక వర్గానికి 3500 ఇళ్ల కేటాయించనున్నారు. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లిస్తారు. దీనికోసం ప్రత్యేకంగా గ్రామాలు, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలోని సభ్యులు, అధికారులు సంయుక్తంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. ఇందిరమ్మ కమిటీల నియమాకానికి గ్రామ సభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహిస్తారు.



వికారాబాద్ రాజీవ్ గృహకల్ప కాలనీ

ఇవీ నిబంధనలు
- పేద మధ్య తరగతి వారై ఉండాలి.
- జాతీయ ఆహార భద్రత కార్డు తప్పనిసరి.
- అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం.
- ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం.
- సొంత ఇంటి జాగా కలిగి ఉండాలి.

వీరికి స్థానం కల్పిస్తారు: జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. తొలి విడతలో భాగంగా జిల్లాకు 14 వేల ఇళ్లు మంజూరు చేస్తారు. పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల్లో వార్డు కమిటీల నియామకానికి అధికారులు కార్యాచరణ చేపడుతున్నారు.
- పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసింది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచ్‌ల స్థానంలో ప్రత్యేకాధికారికి ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పించారు. ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ఒకరు చొప్పున పంచాయతీ కార్యదర్శి గ్రామ కమిటీలో భాగస్వామ్యం అవుతారు.
- పురపాలిక సంఘాల పరిధిలో వార్డు కౌన్సిలర్, ఇద్దరు మహిళా పొదుపు సంఘాల సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున సభ్యులుగా ఉంటారు. ఎవరైనా అనర్హులు ఎంపికై బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేసి నిధులు రాబట్టే అధికారం వీరికి ఉంటుంది.

పురపాలికలు..	వార్డులు
తాండూరు:	36
వికారాబాద్:	34
పరిగి:	15
కొడంగల్:	12

- జిల్లాలో గ్రామ పంచాయతీలు: 566
- ఒక్కో గ్రామ కమిటీలో సభ్యులు.. 7
- మొత్తం సభ్యులు .. 3,962
- 4 పురపాలికల వార్డు కమిటీల్లో సభ్యులు : 679
- గ్రామాల్లో 566 పట్టణాల్లో 97

అన్నీ పారదర్శకంగా సాగుతాయి: రాకేశ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్, వికారాబాద్.

ఇళ్లకు సంబంధించిన పనులన్నీ పారదర్శకంగా సాగుతాయి. వికారాబాద్ పురపాలిక సంఘంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపిక చేస్తున్నాం. వార్డుకు 7 మంది సభ్యులతో కమిటీ నియమిస్తాం. వార్డులన్నింటిలో కమిటీలను ఏర్పాటు చేస్తాం.

పండగ వేళ.. తాగునీటికి పాట్లు



ఖాళీబిందెలతో కొటాలగూడ గ్రామస్థులు

వికారాబాద్ గ్రామీణ: అందరూ దసరా పండుగ చేసుకుంటే మా గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని మండల పరిధిలోని కొటాలగూడ గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శని, ఆదివారాలు భగీరథ నీరు రాకపోగా ఉన్న బోరుమోటార్ కాలిపోయింది. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా ఎలాంటి స్పందన రాలేదని వారు వాపోయారు. గ్రామానికి దూరంగా ఉన్న బోరు నుంచి బిందెలతో మోసుకొని రావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వారం రోజులుగా ఇళ్లల్లో చెత్త పేరుకుపోతోంది. చెత సేకరించే వారు కూడా రాకపోవడంతో రోడ్లపైనే పారబోస్తున్నారు. గ్రామంలో పండగరోజు నీటి సరఫరా లేక ఇబ్బందులు పడాల్సి వచ్చిందని గ్రామస్థురాలు శాంతిబాయి, తదితరులు తెలిపారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి తబుసమ్ మాట్లాడుతూ..సిబ్బంది తప్పిదం వల్ల నీటి ట్యాంకులో నీరు నింపలేదన్నారు. భగీరథ నీరు కూడా రాలేదన్నారు, దీంతో రోజంతా బోరు వాడాల్సి వచ్చిందని, ఫలితంగా బోరుమోటర్ కాలిపోయిందన్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే చెత్త సేకరణ, పారిశుద్ధ్య చర్యలు కూడా ప్రారంభిస్తాని వివరించారు.

అభివృద్ధి కొడంగల్‌కే పరిమితమా..

వికారాబాద్, న్యూస్‌టుడే: గతంలో కొనసాగిన ముఖ్యమంత్రులు వారి సొంత జిల్లాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం సొంత నియోజకవర్గం కొడంగల్‌ను మాత్రమే అభివృద్ధి చేస్తూ, మిగతా పరిగి, వికారాబాద్, తాండూర్ నియోజకవర్గాలను గాలికి వదిలేశారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. కొడంగల్ అభివృద్ధికి రూ.5 వేల కోట్లు కేటాయిస్తే మిగతా నియోజకవర్గాలకు రూ.500 కోట్ల చొప్పున కేటాయిస్తే బాగుండేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 ఇంటిగ్రేటెడ్ గురుకులాలను మంజూరు చేస్తే జిల్లా కేంద్రానికి ఇవ్వకుండా కొడంగల్‌లో ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. చాలా కాలం కిందటే మన్నెగూడ- అప్పా జంక్షన్ నాలుగు వరుసల రోడ్డు మంజూరైందని ఇప్పటికైనా స్పందించి పనులు జరిగేలా చూడాలన్నారు. రాడార్ కేంద్రం ఏర్పాటు సరికాదన్నారు. భారాస నాయకులు బి.కృష్ణయ్య, విజయ్, రవిశంకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

ఆత్మీయ కలయిక.. వారిపైనే అందరి దృష్టి

తాండూరు: తాండూరులో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో రాజకీయ వైరీ వర్గంగా ఉన్న శాసన మండలి విప్ పట్నం మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శనివారం దసరా పండగ నేపథ్యంలో ఒకే వేదికపై ఆశీనులయ్యారు. ముగ్గురు నేతలు ఒకరికి ఒకరు కరచాలనం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. శమీ వృక్షం వద్ద పూజలు చేశారు. పాలపిట్టను గాల్లోకి వదిలారు. ఒకరికి ఒకరు శమీపత్రాలు ఇచ్చి పుచ్చుకుని ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు అందజేసుకున్నారు. సరదాగా నవ్వుకున్నారు. ఈ దృశ్యాలు ఉత్సవానికి వచ్చిన ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాజకీయాలు రాజకీయాలే..పండగ పండగే అని మరికొందరు మాట్లాడుకున్నారు.



దరహాసంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, శాసన మండలి విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

అభివృద్ధికి సమష్టిగా పని చేస్తాం

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ విపణిలో నెలకొన్న రేణుకా ఎల్లమ్మ దేవాలయం నుంచి బోనమ్మ దేవాలయానికి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. అందరం కలిసి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఉత్సవాల్లో మున్సిపల్ అధ్యక్షురాలు స్వప్న, ఉపాధ్యక్షురాలు పట్లోళ్ల దీప, విపణి అధ్యక్షుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లెకు మార్గం.. సుగమం

న్యూస్‌టుడే, తాండూరుగ్రామీణ



కంకరతేలిన రహదారి

రూ.16.30కోట్లతో అనుబంధ రోడ్ల నిర్మాణాలు

గ్రామీణ ప్రజల ప్రయాణానికి మార్గం సుగమం కానుంది. అనుబంధ రహదారుల నిర్మాణ కల సాకారం కానుంది. వెరసి తక్కువ దూరం ప్రయాణించి పల్లెలకు చేరుకునే వెసులుబాటు లభించనుంది. సమయం ఆదా కానుంది. రహదారుల మంజూరు నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

ఇతర గ్రామాల మీదుగా రావాల్సిన పరిస్థితి: జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలు, 4 మున్సిపాలిటీలు ఉండగా, 20 మండలాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. దాదాపుగా అన్ని గ్రామాలకు అనుబంధ దారులు అధ్వానంగా ఉన్నాయి. ఉదాహరణకు.. కొడంగల్, బషీరాబాద్, పెద్దేముల్, వికారాబాద్ మండలాల్లో మారుమూల తండాలు ఎక్కువగా ఉన్నప్పటికీ మట్టిదారులే దిక్కు. వర్షాకాలం వచ్చిందంటే వీటిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.
- మోమిన్‌పేట మండల పరిధిలో అనుబంధ తండాలకు మట్టిదారుల్లో వెళ్లలేక ప్రజలు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు.
- తాండూరు మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా వీటికి అనుబంధంగా మరో 13 గ్రామాలు కొనసాగుతున్నాయి. ఇవి ఒకదానికికొకటి పక్కపక్కనే ఉన్నప్పటికి రహదారి సదుపాయంలేక ఇతర గ్రామాల మీదుగా రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. దీంతో వాహనదారులపై రవాణా భారం పడుతుండగా సమయం వృథా అవుతోంది. మండలంలోని నారాయణ్‌పూర్-పాతతాండూరు దూరం 5.10కి.మీ. ఉండగా రహదారి నిర్మించని కారణంగా యాలాల మండలం మీదుగా 16 కి.మీ. ప్రయాణించి గ్రామానికి చేరుకుంటున్నారు. తాజాగా ఆయా రహదారుల్లో పంచాయతీరాజ్ శాఖ అధికారులు రూ.16.30కోట్లు నిధులతో 22.15కి.మీ మేర తారు రహదారులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

కొత్తగా నిర్మించబోయే మార్గాలు ఇవే..

రహదారి	కి.మీ.	రూ.కోట్లు
కోటబాస్పల్లి-మల్కాపూర్	1.70	1.30
గౌతాపూర్-చెంగెష్‌పూర్	2.60	2
పాతతాండూరు-నారాయణ్‌పూర్	5.10	3.60
ఓగీపూర్-కర్ణాటక సరిహద్దు	2.20	1.50
వీరారెడ్డిపల్లి-బెల్కటూరు	2.70	1.75
మిట్టబాస్పల్లి-బెల్కటూరు	1.60	1.15
సంకిరెడ్డిపల్లి-సిరిగిరిపేట	1.65	1.25
చిట్టిగణాపూర్-చంద్రవంచ	1.60	1.10
సిరిగిరిపేట-అల్లాపూర్	2.40	2.15
గౌతాపూర్-గోపన్‌పల్లి	0.60	50లక్షలు

టెండరు ప్రక్రియ నిర్వహిస్తున్నాం:



గ్రామాలకు కొత్తగా అనుబంధ రహదారులు నిర్మించేందుకు టెండర్లు పిలిచాం. మట్టిదారులు, పానాది మార్గాల్లో తొలిసారిగా తారు రహదారులు నిర్మింపజేస్తాం. త్వరలోనే పల్లెలకు కొత్త తారు రహదారులు అందుబాట్లోకి వస్తాయి. – **నాగభూషణం, డీఈ, పంచాయతీరాజ్ శాఖ, తాండూరు.**


మంచి కంపెనీలను స్వాగతిస్తాం



కార్యకర్తలతో పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, న్యూస్‌టుడే: నియోజక వర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు మంచి జరిగే కంపెనీలను తీసుకొని వస్తే స్వాగతిస్తామని, ఫార్మా కంపెనీలను అడ్డుకొని తీరుతామని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొడంగల్ నియోజకవర్గంలోని భారాస కార్యకర్తలను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపేందుకు అన్ని మండలాల్లో ఆయన పర్యటించారు. అనంతరం కొడంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడంలేదన్నారు. సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లికి రూ.200 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారని కొడంగల్‌పై సవతి ప్రేమ చూపిస్తున్నారన్నారు. కొడంగల్ అభివృద్ధికి తగిన కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు మధుసూదన్‌యాదవ్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం.. ఆశావహం



110 కిలోమీటర్లు.. 4,500 ఎకరాలు

● ట్రిపుల్‌ఆర్ భూనిర్వాసితులకు విలువ పెంచి అందించేందుకు చర్యలు
● ఉమ్మడి మెదక్ జిల్లాలో 4,500 ఎకరాల రైతులకు మేలు

న్యూస్‌టుడే, తూప్రాన్, నర్సాపూర్, గజ్వేల్: రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలోని గ్రామాల్లో ఇప్పటికే ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియ చేపట్టారు. రైతులకు మెరుగైన నష్టపరిహారం ఇవ్వాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణం అవుతున్న గ్రామాల్లో భూముల విలువను మూడు రెట్లు పెంచింది. కనిష్ఠంగా ఎకరాకు రూ.4.25 లక్షలు ఉన్న విలువను రూ.16.50 లక్షలకు పెంచింది. రూ.7 లక్షలకు పైగా ఉన్న చోట రూ.20 లక్షల వరకు మార్కెట్ విలువను పెంచింది. వాటి వివరాలను ధరణి వెబ్‌సైట్‌లో అధికారులు పొందుపరిచారు. కేంద్ర ప్రభుత్వ అధికారులకు సైతం రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన విలువల నివేదికను అందజేశారు. వారి నుంచి స్పష్టత రాగానే ఎంత చెల్లించాలనే విషయమై కొలిక్కి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉత్తర భాగంలో సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవపూర్ మండలం వరకు 110 కిలోమీటర్ల పరిధిలో 4,500 ఎకరాల భూమి అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. భూముల సర్వేను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలను సిద్ధం చేశారు. కొన్ని సమస్యాత్మక గ్రామాల్లో క్షేత్రస్థాయిలో అధికారులు సర్వేలు, రికార్డులను పరిశీలిస్తున్నారు.

కొనసాగుతున్న ఆందోళనలు

ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణం కానున్న పలు గ్రామాల్లో రైతులు భూనిర్వాసితులు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలోని నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్ డివిజన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఎకరాకు ఎక్కడా రూ.కోటికి తక్కువ లేదు. కొన్ని చెరువులు, కుంటల సమీపంలోని గ్రామాల్లోనూ ఎకరాకు రూ.40 లక్షలపైన ఉంది. మార్కెట్ విలువల ఆధారంగా తమకు నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళనలు చేస్తున్నారు. అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విలువలపై మూడు రెట్లు ఇస్తేనే మార్కెట్ ధర పరిహారం వస్తుందని భూయజమానులు భావిస్తున్నారు.


భూయజమానులతో చర్చిస్తున్న ఆర్డీఓ

ఎవరూ ఆందోళన చెందొద్దు

తూప్రాన్ డివిజన్ పరిధిలో ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. గతంలో మార్కెట్ విలువను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా పెంచారు. ధరణిలో నమోదై ఉంది. వీలైనంత మేర ఎక్కువ పరిహారం అందించేందుకు చొరవ తీసుకుంటున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
జయచంద్రారెడ్డి, ఆర్డీవో తూప్రాన్

రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి:



రాష్ట్ర ప్రభుత్వం ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో విలువైన భూములు కోల్పోతున్న విషయాన్ని గుర్తించి మార్కెట్ విలువలను పెంచడం సంతోషకరం. పెంచిన విలువ ఆధారంగానే భూనిర్వాసితులకు తగిన పరిహారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది. **సక్రు, ఎల్లారెడ్డి గూడెం తండా**

న్యాయం జరిగే వరకు పోరాటం:



ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణంలో విలువైన భూములు కోల్పోతున్నాం. ప్రస్తుతం ఉన్న విలువల ప్రకారం తక్కువ పరిహారం వస్తుంది. మార్కెట్ ధర ప్రకారం ఇవ్వాలి. లేదంటే మాకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తునే ఉంటాం. ఇప్పటికే మా గ్రామంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు భూములు కోల్పోయాం. **యాదయ్య, రెడ్డిపల్లి**

దేశభక్తి గుర్తింపు.. పోటీలతో పెంపొందు



వీర్‌గాథ-4.0 పేజీ

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించడానికి దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల గాథలు తెలియజేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోటీలను నిర్వహిస్తోంది. మంత్రిత్వ రక్షణ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి 'వీర్‌గాథ-4.0' పేరిట వీటిని చేపట్టింది. ఇప్పటికే దృశ్యశ్రవణ సమావేశం ద్వారా సూచనలు చేశారు. ముందుగా వెబ్‌సైట్‌లో పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు 150 పదాలకు మించకుండా 'నా రోల్ మోడల్' శీర్షికతో గ్యాలంట్రీ అవార్డు పొందిన దేశభక్తుడి గురించి వ్యాసం రాయడం లేదా డ్రాయింగ్ వేయాల్సి ఉంటుంది. 6-8వ తరగతి విద్యార్థులు గ్యాలంట్రీ అవార్డు పొందిన వారి త్యాగం గురించి 300 పదాలకు మించకుండా వ్యాసం లేదా డ్రాయింగ్ లేదా మల్టీ మీడియా ప్రదర్శన ఇవ్వాలి. 9-10వ తరగతి వారు 'రాణి లక్ష్మీబాయి కలలోకి వస్తే', 'నేను దేశ సేవ ఎలా చేస్తా' అనే అంశంతో 750 పదాల వ్యాసం లేదా డ్రాయింగ్, మల్టీమీడియా ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. ఇంటర్ విద్యార్థులు స్వాతంత్ర్య ఉద్యమంలో 1857 తిరుగుబాటులో ప్రేరేపించిన అంశంపై వెయ్యి పదాల్లో వ్యాసం లేదా చిత్రలేఖనం పోటీలు ఉంటాయి.

సూపర్ 100 మంది విజేతలయ్యే తీరు

● జిల్లా స్థాయిలో నలుగురిని ఎంపిక చేస్తారు.
● రాష్ట్ర స్థాయిలో 8 మంది విజేతలు
● జాతీయ స్థాయికి 100 మంది ఎంపికవుతారు.
● 3వ తరగతి నుంచి 5 వరకు.. 6 నుంచి 8 వరకు.. 9, 10 తరగతుల నుంచి.. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల నుంచి 25 మంది చొప్పున మొత్తం 100 మంది ఎంపికవుతారు.
● నగదు బహుమతి రూ.10 వేల చొప్పున ఒక్కొక్కరికి ఇస్తారు.
● పోర్టల్‌లో నమోదుకు గడువు అక్టోబరు 15
● వెబ్‌సైట్ mygov.in పేజీలో 'వీర్‌గాథ' ఆప్షన్ క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలి.
● 17వ తేదీ నుంచి నవంబర్ 10 వరకు జిల్లా స్థాయి, నవంబర్ 12 నుంచి 30 మధ్య రాష్ట్ర స్థాయి, డిసెంబర్ 4-24 మధ్య జాతీయ స్థాయి పోటీలుంటాయి.

సద్వినియోగం చేసుకోవాలి:



జాతీయ స్థాయిలో విద్యార్థుల గుర్తింపు దక్కించుకునేందుకు ఇది చక్కని అవకాశం. పోటీలకు ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా కృషి చేస్తున్నాం. సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం కాగానే అధిక సంఖ్యలో నమోదు జరిగేలా చూస్తాం. **సుదర్శనమూర్తి, జిల్లా సెక్టోరల్ అధికారి, మెదక్**

రైతులకు పంట రుణాలు అందించాలి: సీపీఎం

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: రుణమాఫీ పూర్తయిన రైతులకు తిరిగి వెంటనే రుణాలు అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఆదివారం పార్టీ సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాములు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావొస్తున్నా రుణమాఫీ హామీ పూర్తికాలేదని, మాఫీ అయినా చాలా మందికి రుణాలు ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వనదుర్గ వర్చస్సు.. భక్తులకు ఉషస్సు


రాజరాజేశ్వరీదేవిగా వనదుర్గ


అమ్మవారి పల్లకీ సేవ

పాపన్నపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఏడుపాయల ఆలయంలో విశేష పూజలు, అలంకరణ నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా భక్తుల సందర్శనలతో కిటకిటలాడింది.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గోకుల్‌షెడ్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం ముందు ఉన్న నదీపాయ వద్ద మంజీరా మార్జనం కార్యక్రమం నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా వనదుర్గను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు అమ్మనామస్మరణతో మార్మోగాయి. వాహన పూజలు అధికంగా జరిగాయి.

దేవీ దర్శనం.. మనసు తన్మయత్వం



న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ: ఉత్సవాల చివరి రోజున వర్గల్ విద్యాసరస్వతి అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం తెల్లవారుజామున వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శమీ పూజ అనంతరం అమ్మవారు సకల జయాలు సిద్ధింప చేసే రాజరాజేశ్వరి మాతగా భక్తులకు దర్శనమివ్వడంతో తన్మయత్వం చెందారు. స్థానిక వెంకటేశ్వర ఆలయంలో శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

త్రిరాత్రోత్సవం సంపూర్ణం


కొమురవెల్లిలో త్రిశూల స్నానం

చేర్యాల, ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో త్రిరాత్రోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. దుర్గాదేవి ఉత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రతి ఏటా త్రిరాత్రోత్సవాలలో భాగంగా దుర్గామాతను ప్రతిష్ఠించడం అనవాయితీ. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన దుర్గామాత విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. కోనేరులో అర్చకులు త్రిశూలస్నానం చేశారు. ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, స్థానాచారి పి.మల్లయ్య, ఏఈవో బుద్ధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈశ్వరుడే ఈశ్వరి రూపం


జిన్‌గుర్తిలో..

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఈశ్వరుడు, ఈశ్వరిని వేర్వేరుగా కాకుండా ఒక్కటిగా నిర్వాహకులు అలంకరించారు. భక్తులు దర్శించుకున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జిన్‌గుర్తి రామలింగేశ్వరస్వామిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు.

అమ్మ రావాలి.. ఆకలి తీర్చాలి

ఏ ప్రాణయినా తన పిల్లల కడుపు నింపేందుకు పోరాటం చేస్తుంది. కొన్ని స్వయంగా ఆహారం అందిస్తుంటే, మరికొన్ని సేకరించి మరీ అందిస్తాయి. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఓ వెంచర్‌లో చిన్న చెట్టుపై ఓ పక్షి గూడు పెట్టింది. అందులో రెండు పిల్లలు ఉండగా, వాటికి ఆహారం తెచ్చేందుకు తల్లి పక్షి ఎటో వెళ్లింది. ఆ సమయంలో పిల్ల పక్షులు ఆకలేసి అరుస్తుండగా 'న్యూస్‌టుడే' కెమెరా క్లిక్‌మనిపించింది. కాసేపటికి తల్లి పక్షి ఆహారం తీసుకురాగా పిల్లలు అరుపులు మానేశాయి. **న్యూస్‌టుడే, తూప్రాన్**



ఉత్సవాల్లో అపశ్రుతి

విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయిన బాలిక


కీర్తన్య

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. నిమజ్జనానికి దుర్గామాతను ఊరేగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై బాలిక శిక కీర్తన్య(8) దుర్మరణం చెందింది. ఈ విషాద ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పోతారం(జె) గ్రామంలో జరిగింది. దసరా పండగ పూట గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎస్ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు గ్రామానికి చెందిన తిరుపతి, మౌనిక దంపతులకు కూతురు కీర్తన్యతో పాటు కుమారుడు ఉన్నారు. వారిది వ్యవసాయ కుటుంబం. గ్రామంలో ఒక దుర్గామాత విగ్రహాన్ని శనివారం రాత్రి ఊరేగించారు. డీజేతో నృత్యాలు చేస్తుండగా చూసేందుకు గ్రామస్థులు తరలివచ్చారు. డీజే పరికరాలకు ఉపయోగించిన తీగ కొంచెం తెగిపోయి నేలపై పడి ఉంది. ఎవరూ గమనించలేదు. ఇంతలో బాలిక కీర్తన్య వచ్చి ఆ తీగపై అడుగేయగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. గమనించిన స్థానికులు వైరును తొలగించారు. బాలికను నంగునూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి మృతి చెందింది. చలాకీగా ఆడుతూ పాడుతూ ఉండే బాలిక మృతి చెందడంతో తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ విజయభాస్కర్, విద్యుత్తు సిబ్బంది సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పండక్కి వస్తూ.. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం


మొగులప్ప

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై బుర్రితండా సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలు.. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం చింతల్‌దిన్నెకు చెందిన మొగులప్ప(40) హైదరాబాద్‌లో మేస్త్రీ పనులు చేస్తుంటాడు. ఆదివారం పండుగ కోసం బైకుపై స్వగ్రామానికి వెళ్తుండగా.. బుర్రితండా సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. మొగులప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఆశప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మొగులప్పకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

మొక్కజొన్న పొలానికి కాపలా వెళ్లిన రైతు..

పెద్దేముల్, న్యూస్‌టుడే: పొలం వద్ద కాపలాకు వెళ్లిన వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పెద్దకురువ బాలప్ప (38) శుక్రవారం రాత్రి తన మొక్కజొన్న పొలానికి వెళ్లాడు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కన రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గ్రామానికి చెందిన వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలప్ప చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్య అంజిలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో గొడవ.. స్నేహితుడి దారుణ హత్య


నదీమ్

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో గొడవ పడిన కొందరు యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుధేర గ్రామానికి చెందిన అక్బర్‌పాషా, షాహిన్‌బేగం దంపతులు 40 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చి జగద్గిరిగుట్ట పరిధి దీనబంధు కాలనీలో నివాసముంటున్నారు. కుమారుడు నదీమ్(21). అక్బర్ పాషా మసీదులో పనిచేస్తున్నాడు. తరచూ స్నేహితులతో గొడవపడేవాడు. ఆదివారం రాత్రి తన మిత్రుడి జన్మదిన వేడుకలకు వెళ్లి మద్యం తాగాడు. రోడ్డుపై స్నేహితులతో కలిసి గొడవ పడడంతో పోలీసులు వచ్చి వారికి సర్దిచెప్పి ఇంటికి పంపించారు. అనంతరం కొంతమంది నదీమ్ ఇంటికి వెళ్లి బయటకు పిలిచి గొడవపడ్డారు. ఘర్షణ పెద్దది కావడంతో ఇనుపరాడ్‌తో నదీమ్ తలపై కొట్టడంతో కుప్పకూలాడు. రక్తపు మడుగులో ఉన్న అతడిని పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. సోదరి ఫిర్యాదు మేరకు అనుమానితుడు ఖలీల్‌తోపాటు మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

బలవన్మరణం.. కుటుంబాలు అతలాకుతలం

సమస్యలను అధిగమిస్తూ జీవనాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన వ్యక్తులు కొందరు బాధలను భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆయా కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ముగ్గురు పండుగ రోజుల్లో బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులకు తీరని దుఃఖం మిగిల్చారు.

పెళ్లి కావడం లేదని.. యువకుడి ఆత్మహత్య


అనిల్

మనోహరాబాద్, న్యూస్‌టుడే: పెళ్లి కుదరడం లేదని అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కాళ్లకల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వీరబోయిన భాస్కర్‌కు ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు అనిల్ (28)కు పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరటం లేదు. తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గతంలో ఓ ప్రమాదంలో పైనుంచి కింద పడగా ఒక మూత్రపిండం తొలగించారు. తరచుగా అనారోగ్యానికి గురవుతుండటంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు గమనించి మేడ్చల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

మద్యం తాగొద్దన్నందుకు డ్రైవర్..

రామాయంపేట, న్యూస్‌టుడే: మద్యం తాగడం మానివేయాలని కుటుంబ సభ్యులు సూచించడంతో.. ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన మారగాని రాజు(32) జీవనోపాధి కోసం గుండ్లపోచంపల్లిలో ఆరు నెలలుగా కుటుంబంతో సహా నివాసం ఉంటున్నాడు. ఆటో నడపడంతో పాటు కూలీ పనులు చేస్తున్నాడు. మద్యం తాగుతుండటంతో ఇంట్లో గొడవలు జరిగేవి. ఈ విషయమై మరోమారు గొడవ జరగడంతో ఆటోలో రామాయంపేట మండలం అక్కన్నపేటకు వచ్చి.. ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు.

అలవాటు మానలేక మెకానిక్ ..

హుస్నాబాద్, న్యూస్‌టుడే: మద్యం తాగడం మానేసేందుకు చికిత్స తీసుకున్నా .. అలవాటు మానక దానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగింది. ఎస్ఐ మహేశ్ తెలిపిన వివరాలు.. స్థానికంగా ద్విచక్ర వాహన మెకానిక్ దగ్గర పని చేసిన నమిలికొండ రాజేందర్ (43)కు భార్య రమాదేవి, కుమార్తె ఉన్నారు. గత కొంతకాలంగా రాజేందర్ మద్యానికి బానిసయ్యాడు. చికిత్స కేంద్రం నుంచి తిరిగి వచ్చి మళ్లీ తాగుతున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమై.. విగతజీవిగా మారి..


మోహన్

నర్సాపూర్, న్యూస్‌టుడే: ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి విగతజీవిగా మారిన ఘటన నర్సాపూర్ పట్టణంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఒంటెద్దు(మందుల) మోహన్(35) ఈనెల 10వ తేదీన పనిపై బయటకు వెళ్లాడు. రాత్రికి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మరుసటి రోజు మోహన్ అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం సాయంత్రం నర్సాపూర్‌లోని పందివాగులో మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం మోహన్‌దిగా గుర్తించారు. అతడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మోహన్ స్థానికంగా ప్లాస్టిక్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

ప్రదర్శన వైవిధ్యం.. అవగాహన అనునిత్యం

● ఉత్తరాది ప్రజల శైలిపై అధ్యయనంతో విద్యార్థులకు ప్రయోజనం

న్యూస్‌టుడే, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం


ఈశాన్య రాష్ట్ర వాసులతో విద్యార్థులు


అక్కడి ప్రజలు ధరించే టోపీలు

దేశంలో అన్ని రాష్ట్రాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు ఒకే విధంగా ఉండవు. తెలుగు రాష్ట్రాలతో పోల్చితే ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తర భారత దేశంలోని రాష్ట్రాల్లోనివి భిన్నంగా ఉంటాయి. వీటన్నింటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉన్నత విద్యాశాఖ ఇటీవల 'భారతీయ కళా మహోత్సవ్' పేరిట ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించింది. హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయగిరి భిక్షపతి ఆధ్వర్యంలో హైదరాబాద్ బొల్లారం రాష్ట్రపతి నిలయానికి వెళ్లారు. ఈనెల 6 వరకు మొత్తం తొమ్మిది రోజుల పాటు ప్రదర్శనలు నిర్వహించారు. అక్కడి ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, పద్ధతులను తెలిపే స్టాళ్లు ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, సిద్దిపేటలోని డిగ్రీ కళాశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు ఈ నెల 5న సందర్శించారు.

పుస్తకాల్లో చదివినవి ప్రత్యక్షంగా చూశా

– గడిపె సుజిత్, బీకాం ద్వితీయ

ఈ ప్రదర్శన చాలా బాగుంది. వివిధ రాష్ట్రాల్లోని ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం గురించి తెల్సుకున్నా. తెలుగు ప్రజలతో పోల్చితే వారి జీవన విధానం, పద్ధతులు, తీసుకునే ఆహారం తదితర అంశాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. పుస్తకాల్లో చదివిన విషయాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నా. అవకాశం కల్పించిన ప్రిన్సిపల్‌కు కృతజ్ఞతలు.

నల్లటి బియ్యంతో అన్నం

– చెన్నూరి జ్యోతి, బీజడ్‌సీ ద్వితీయ

రాష్ట్రపతి నిలయంలో వివిధ రాష్ట్రాల గురించి తెల్సుకున్నా. అందులో ఉత్తర భారతంలోని రాష్ట్రాల ప్రజల జీవన విధానం, పద్ధతులు, ఆహారపు అలవాట్లు, కళలు, నృత్యాలు ప్రదర్శించారు. వంట పాత్రలు కలపతో చేసినవి ఉంటాయి. బియ్యంతో చేసిన అన్నం తినడం తక్కువ. నల్లటి బియ్యాన్ని సొంతంగా పండించుకొని వాటినే అన్నం చేసుకొని భోంచేస్తారు. చపాతీల వాడకం ఎక్కువ.

కర్రలు, గడ్డితో ఇళ్లు

– ఎండీ సమీనా, బీఏ ద్వితీయ

ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఇళ్లు, ఉపయోగించే వివిధ రకాల పరికరాలు, దుస్తుల గురించి తెల్సుకున్నా. కర్రలు, గడ్డితో నిర్మించిన ఇళ్లలో అక్కడి ప్రజలు నివసిస్తున్నారు. వారి భాష భలేగా ఉంది. విభిన్న సంస్కృతుల గురించి తెలుసుకోవడం కొత్త అనుభూతి కలిగింది.

ప్లాస్టిక్ గ్లాసులు లేవు

– జక్కు క్రాంతి, బీఎస్సీ తృతీయ

అధ్యాపకుడు చుక్క రమేశ్‌తో కలిసి వెళ్లాం. ఈశాన్య రాష్ట్రాల ప్రజల జీవనశైలి విభిన్నంగా ఉంటుందని తెలుసుకున్నా. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడరు. లోహం, కలప, చెట్టు భాగాలతో చేసినవి వినియోగిస్తారు. నీళ్లను కర్ర పాత్రలో నుంచి తాగుతారు. బంగారం, వెండి ఆభరణాలు వేసుకోవడం తక్కువ. పూసలు, దారాలు, కర్రతో తయారు చేసిన ఆభరణాలు ధరిస్తారు. నృత్యాలు విభిన్నం.

స్నానానికి వెళ్లి.. నీట మునిగి ఇద్దరు మృతి


సంగెం విఠల్

పుల్కల్, బషీరాబాద్, న్యూస్‌టుడే: వేర్వేరు ఘటనల్లో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు మృతి చెందారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు వద్ద ఘటన జరిగింది. ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు.. సింగూరు గ్రామానికి చెందిన సంగెం విఠల్ (40) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈనెల 11న ప్రాజెక్టు దిగువ భాగాన స్నానం చేయడానికి దిగి మునిగిపోయాడు. ఆ సమయంలో ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి నీటి విడుదల కొనసాగుతుండడంతో పాటు జల విద్యుత్తు కేంద్రం ద్వారా నీరు దిగువకు వెళుతోంది. సమాచారం తెలిసిన వెంటనే అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం విఠల్ ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం గేట్ల వద్ద మృతదేహం కనిపించింది. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● వికారాబాద్ జిల్లా బషీరాబాద్ ఎస్ఐ గఫార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్డిఘనాపూర్‌కు చెందిన అశోక్ (38) వ్యవసాయ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దుర్గామాత ఉత్సవాలు ముగిసిన తర్వాత ఆదివారం అక్కడే చెరువులో ఈతకు వెళ్లాడు. ఈదుతుండగా బురదలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. అక్కడే ఉన్న కొందరు వెతికి తీసేసరికి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 126–00	డ్రెస్డ్ 215–00
రిటైల్ 148–00	స్కిన్‌లెస్ 244–00

ఆకాశ దీపాలు ప్రారంభం

దుద్యాల, న్యూస్‌టుడే: ఈర్లపల్లి, సంత్రకుంటతండా పంచాయతీ పరిధిలోని నాన్యానాయక్ తండాల్లో కాంగ్రెస్ నాయకులు ఆకాశ దీపాలను శనివారం ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.1.80 లక్షలతో మంజూరైన నిధులతో ఈ ఆకాశ దీపాలను ప్రారంభించినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుటి శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిపథంలో దసూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్, నాయకులు పిట్ల మొగులయ్య, రాహుల్, పెంటప్ప తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల విరాళం

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గ్రామంలోని శ్రీ సంగమేశ్వర దేవాలయానికి రూ.13,500లు విరాళంగా అందించారు. దేవాలయంలో అభివృద్ధి పనులు చేపట్టడంతో తమవంతుగా ఆర్థిక సహాయం అందించినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. మొత్తాన్ని ఆదివారం పూజారి శరత్‌చంద్రకు అందించారు. కార్యక్రమంలో విజయ్‌గౌడ్, శ్రీనివాస్, జగదీష్, భాస్కర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

లఖ్నాపూర్‌కు మహర్దశ!

రూ.43లక్షలతో అభివృద్ధి పనులు

న్యూస్‌టుడే, పరిగి: చూపరులకు ఆహ్లాదాన్ని పంచుతున్న లఖ్నాపూర్ రిజర్వాయరు అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఇదొక్కటే చెప్పుకోదగ్గ ప్రాజెక్టు. దీనిని 1967లో రూ.47.56లక్షల వ్యయంతో 410 ఎకరాల వైశాల్యంలో నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు నిర్వహణ నిధులు అంతంత మాత్రంగానే విడుదలయ్యాయి. ప్రాజెక్టు మీదుగా ఏర్పాటు చేసిన నడక దారి సుమారు 75మీటర్ల దూరం ఉంది. దీనికి ఇనుప బోల్టులు ఊడిపోయాయి. నడుస్తున్న సమయంలో వస్తున్న శబ్దంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం ముంచుకు వస్తుందో తెలియని భయానక పరిస్థితులు నెలకొన్నాయి. దీనిని కొంత ఎత్తు పెంచడం ద్వారా మరింత పటిష్ఠంగా మార్చేందుకు ప్రభుత్వం మెయింటెనెన్స్ కింద రూ.25లక్షలను మంజూరు చేసింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.



బోటింగ్ ప్లాట్‌ఫాం

బోటింగ్‌పై దృష్టి..

జిల్లాలోని కోట్‌పల్లి ప్రాజెక్టులోనే బోటింగ్ సదుపాయం ఉంది. ఇక్కడ కూడా అమలు చేస్తే ఎలా ఉంటుందని అధికారులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ప్లాట్‌ఫాం నిర్మాణం కూడా పూర్తయి మూడేళ్లవుతోంది. తమకు అనుమతి ఇవ్వాలని రెస్టారెంట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కొందరు నీటిపారుదల శాఖ అధికారులను అడిగారు. ఇది తమ పరిధిలో లేదని పర్యాటకం వారి నుంచి అనుమతి తెచ్చుకుంటే తాము అన్ని విధాలుగా సహకరిస్తామని వారికి బదులిచ్చారు. అనుమతులు వస్తే పనిలో పనిగా ప్రాజెక్టుపై విద్యుద్ధీరణ పనులు చేపట్టి సుందరంగా మారుస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

రూ.18లక్షలతో కాల్వలు బాగు

కుడి కాల్వ ఆయకట్టు 1132 ఎకరాలు ఉండగా ఎడమ కాల్వ ఆయకట్టు 1505 ఎకరాలు ఉంది.



మరమ్మతు చేయాల్సిన నడక ప్రదేశం

ఇవి కూడా పూర్తిగా దెబ్బతిని అస్తవ్యస్తంగా మారి నీటి ప్రవాహానికి తీవ్ర అడ్డంకిగా ఉండేది. ఇటీవల మరమ్మతు పనులకు రూ.18లక్షలు విడుదల కావడంతో పనులు కొనసాగుతున్నాయి. పూర్తయితే అన్నదాతల అవస్థలు చాలా వరకు తీరనున్నాయి.

ఒప్పందం పూర్తయింది



నడకదారి అభివృద్ధి పనులకు అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయింది. డిసెంబరులోగా పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. బోటింగ్ ఏర్పాటు చేస్తామని ముందుకు వస్తున్నారు. పర్యాటకం నుంచి అనుమతులు తెచ్చుకుంటే తమవైపు నుంచి అన్ని విధాలుగా ప్రోత్సహిస్తాం. - **చందా రేణుకా దేవి, ఈఈ, నీటిపారుదల శాఖ, చేవెళ్ల**

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, దౌల్తాబాద్: ? పలు కాలనీలలో మురుగు నీరు సీసీ రోడ్లపై పారి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. – **నవీన్, దౌల్తాబాద్.**

✓ కాలనీలలో పారిశుద్ధ్య పనులను ఎప్పటికపుడు పర్యవేక్షిస్తాం. అక్కడక్కడా మురుగు కాల్వలు అసంపూర్తిగా ఉండడంతో సమస్య ఏర్పడింది. త్వరలోనే సమస్య తీర్చేలా చర్యలు తీసుకుంటాం.
–**గోపాల్, పంచాయతీ కార్యదర్శి, దౌల్తాబాద్**

న్యూస్‌టుడే, పరిగి: ? పరిగి నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. స్థానికంగా డిపో ఉన్నా.. ఏ బస్సులోనూ సీట్లు దొరకడం లేదు. రెండున్నర గంటల పాటు నిలబడి ప్రయాణించడం కష్టంగా ఉంది. అదనపు బస్సులు నడిపి అవస్థలు తీర్చాలి – **రాజేష్‌కుమార్, వెంకటేష్, పరిగి**

✓ ప్రయాణికుల సౌకర్యం కోసం ఇటీవలే ఉదయం, సాయంత్రం సమయాల్లో కొడంగల్ నుంచి నేరుగా పరిగి మీదుగా హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ బస్సును ప్రారంభించాం. వచ్చే ఆదాయాన్ని బట్టి మరో బస్సును నడిపేందుకు ప్రయత్నిస్తాం. – **కరుణశ్రీ, డిపో మేనేజర్, పరిగి**

న్యూస్‌టుడే, తాండూరు టౌన్: ? ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలోని వీధుల్లో మురుగు సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం.
– **ప్రవీణ్, తాండూరు.**

✓ మురుగు కాల్వలు శుభ్రం చేయటానికి చర్యలు తీసుకుంటాం.
–**విక్రమ సింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు.**

చెరువుల్లోకి నీరు చేరేదెలా?

కాలువల్లో పేరుకుపోతున్న పూడిక

న్యూస్‌టుడే, పూడూరు, దోమ: వరద నీటిని తరలించేందుకు పాటు కాలువలు నిర్మించి జలాశయాలకు మళ్లించి నీటిని నిల్వచేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. కానీ ఆ పాటు కాలువలపై అధికారుల నిర్వహణ, పర్యవేక్షణ లేక చెత్త చెదారానికి నిలయంగా మారుతున్నాయి. పూడిక నిండిపోయి. లక్ష్యం నెరవేరడంలేదు. దీంతో జలాశయాల్లోకి మురుగు చేరడంతో చేపలు, ఇతర జీవరాసులు కనుమరుగవుతున్నాయి.



దోమలో కాలువ

క్షేత్ర స్థాయిలో..

దోమ మండలం బాసుపల్లి వాగు నుంచి వచ్చే వరద నీరు పల్లంగా ఉన్న దోమ గ్రామానికి చేరుకుని ఏటా వర్షాకాలంలో జనాలు ఇబ్బంది పడేవారు. వరదనీటిని అడ్డుకునేందుకు దోమ గ్రామంలో నుంచి సుమారు 2.5 మీటర్ల సామర్థ్యంతో 500 మీటర్ల పొడవైన కాలువను నిర్మించారు. ఈ నీటిని గ్రామానికి దూరంగా ఉన్న నల్ల చెరువుకు తరలించేందుకు ఏర్పాటు చేయడంతో గ్రామానికి వరదనీటి తాకిడి తగ్గింది. ప్రజలు తమ ఇళ్లలో వాడేసిన ప్లాస్టిక్ తదితర వ్యర్థ పదార్థాలను కాలువలోకి విసిరేయటం, వ్యర్థ జలాన్ని కాలువలోకి మళ్లిస్తున్నారు. దీంతో చెత్తాచెదారంతో పాటు మురుగు కాలువగా దర్శనమిస్తూ.. ఒక అడుగు వరకు సిల్టు నిండి కంపు కొడుతోంది. దీంతో దోమలకు, ఈగలకు నిలయంగా మారి రోగాలకు దారితీస్తోంది. పాటు కాలువ ద్వారా వెళ్లే వరదనీరు చెత్తాచెదారాన్ని జలాశయంలోకి చేర్చటంతో స్వచ్ఛంగా ఉండాల్సిన చెరువు కలుషితమవుతూ జల ప్రాణులకు సంకటంగా మారుతోంది.

పూడూరులో ఇలా..

పూడూరు మండల కేంద్రంలోని ఎర్ర చెరువు దాదాపు 16 ఎకరాల వరకు విస్తీర్ణం ఉంటుంది. పై భాగంలో ఉన్న దామగుండం నుంచి వరద వచ్చి ఉండే చెరువులో కలుస్తుంది. కొంత కాలంగా నీరు ఆశించిన విధంగా రావటం లేదు. గుట్టప్రదేశం నుంచి వచ్చే వరద కాలువలు పూడికతో నిండుకుంటుండటంతో భారీ వర్షాలు పడితే తప్పా చెరువులోకి నీరు ఆశించిన విధంగా చేరటం లేదు. సమీపంలో వ్యవసాయ క్షేత్రాలు ఉండటంతో కొందరు వ్యర్థాలను వదులుతున్నారు. కొంత కాలంగా చెరువులో పూడిక తీయకపోవడంతో నిండుకుంటుంది. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండటం లేదు.



పూడూరులో చెరువు ఇలా..

ప్రతిపాదనలు పంపుతాం

చెరువులు, కుంటల్లోకి వెళ్లే కాలువల్లో వ్యర్థాలు వేయకుండా కట్టడి చేస్తాం, ఏటా ఉపాధి హామీ కూలీల ద్వారా కాలువల్లో పూడిక తీయిస్తున్నాం, పరిశీలించి అవసరమైన చోట పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపుతాం, నీటిని పరిశుభ్రంగా ఉంచాలంటే స్థానికుల సహకారం అవసరం, కలుషితం అయితే చేపలు, ఇతర జీవరాసులు మృత్యువాత పడేందుకు ఆస్కారం ఉంటుంది.

రాజేందర్‌రెడ్డి, జలవనరుల శాఖ పర్యవేక్షకుడు, పూడూరు

పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు

కుల్కచర్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బాలుర పాఠశాల ఆవరణ తాగుబోతులకు అడ్డాగా మారింది. పాఠశాల స్టేజీపై తాగిపడేసిన సీసాలు కలకలం రేపాయి. శనివారం ఉదయం వేళ వీటిని చూసిన పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు గతంలో నిర్మించిన ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో పాటు ఒక చోట కూలిపోయింది. దీంతో పరిసరాలకు చెందిన పలువురు యువత సెలవురోజులు వచ్చినా, పండుగలు వచ్చినా మద్యం తాగడానికి అడ్డాగా మారిందని పలువురు పేర్కొంటున్నారు.

వాగు పారింది.. దారి కోతకు గురైంది



దోమ, న్యూస్‌టుడే: ఇటీవలి వర్షాలకు వాగులు వంకలు ఉప్పొంగాయి. పరిగి-మహబూబ్‌నగర్ ప్రధాన రహదారి దోమ మండలం గొడుగోనిపల్లి వంతెన పైనుంచి వాగు పారింది. నీటి ప్రవాహానికి దారి కొట్టుకు పోయింది. పక్కనున్న పొలం కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అధికారులు ప్రమాద హెచ్చరికగా కోతపడిన దారి అంచున ఇలా సున్నపు రాళ్లు పెట్టారు. ఈ విషయమై ఏఈ మహేష్‌ను వివరణ కోరగా.. దారి మరమ్మతు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైతే మరమ్మతు చేయిస్తామని తెలిపారు.

వరి పైరు కాదు.. మురుగు



పరిగిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిలిచిన మురుగు నీరు వరి పైరును తలపిస్తోంది. మురుగులో పెరిగిన మొక్కలు పచ్చగా కనిపించడంతో వరి పైరులా కనిపిస్తోంది. -**పరిగి, న్యూస్‌టుడే:**

ద్విచక్ర వాహనం అదుపుతప్పి గాయాలు..

పరిగి గ్రామీణ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురై ఓవ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటన పరిగి మండల పరిధిలోని జాఫర్‌పల్లి, రాఘవాపూర్ శివారులో పరిగి-షాద్‌నగర్ రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాపోల్ గ్రామానికి చెందిన పరిగి తిరుపతి(38) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, 15 ఏళ్లలోపు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. రాఘవాపూర్ నుంచి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురై పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు పరిగి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఆసుపత్రికి రెఫర్ చేశారు.

పారదర్శకంగా ఇందిరమ్మ కమిటీలు

తాండూరు టౌన్: ప్రభుత్వం పారదర్శకంగానే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజక వర్గం స్థాయి ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాలలో నిజమైన నిరుపేదలను గుర్తించి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామన్నారు. అన్ని వర్గాల పేద ప్రజలను అర్హులుగా గుర్తిస్తామని చెప్పారు.

రంగాపూర్‌లో సత్యసాయి సంకీర్తన



సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

పరిగి, న్యూస్‌టుడే: రంగాపూర్ సమీపాన వెలసిన శ్రీ సత్యసాయి సేవా కేంద్రంలో ఆదివారం మాదారం సమితి ఆధ్వర్యంలో సంకీర్తన నిర్వహించారు. జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఠాగూర్, రాష్ట్ర నైపుణ్యశిక్షణ ఇన్‌ఛార్జి ఎం.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. యువతకు జీవనోపాధి నిమిత్తం నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వికారాబాద్, కెరవెళ్లి, తాండూరు, మాదారం సమితి సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

పూడూరు, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన పూడూరు పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంకల్‌కు చెందిన శంకర్(42) నెల రోజుల క్రితం సమాచారం లేకుండా ఇంటినుంచి వెళ్లిపోయాడు. బంధువుల వద్ద వెతికినా.. ఆచూకీ లభించలేదు. చరవాణికి ఫోన్‌చేస్తే మాట్లాడటం లేదు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడే వాడని భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

చిన్న అనంతగిరి శివాలయంలో భారీ ధ్వజ స్తంభం

రాజేంద్రనగర్: అత్తాపూర్ రాంబాగ్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో 83 అడుగుల ధ్వజస్తంబాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఆరెస్సెస్ అధ్యక్షుడు భరత్‌కుమార్ హాజరయ్యారు.

కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు



రాజును సన్మానిస్తున్న వెంకటేశ్ తదితరులు

పూడూరు, న్యూస్‌టుడే: కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్ అన్నారు. కద్మూరుకు చెందిన రాజుకు ఇటీవల అంబేడ్కర్ అవార్డు వచ్చిన సందర్భంగా జిల్లా మాలమహానాడు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నెపల్లిలో సన్మానం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాజ్‌కుమార్, సురేశ్, రత్నం, రాములు, వెంకట్, వసంత్‌కుమార్, పోచయ్య ఉన్నారు.

తారు రోడ్డు పనులకు భూమిపూజ



బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: బాపల్లితండా నుంచి సీత్యానాయక్‌తండాకు రూ.1.30 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు పనులను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేష్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. మండలంలో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి అధికంగా నిధులు మంజూరు చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింహులు గౌడ్, పార్టీ నాయకులు వెంకట్రాములుగౌడ్, రామచంద్రారెడ్డి, నర్సింహులు నాయుడు, సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు



హకీంపేటలో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

దుద్యాల, న్యూస్‌టుడే: హకీంపేటలో భాజపా సభ్యత్వ నమోదును ఆ పార్టీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోని 150 మంది సభ్యుల వివరాలను చరవాణి యాప్‌లో నమోదు చేసినట్లు నాయకులు తెలిపారు. నాయకులు శ్రీకాంత్, బాల్‌రాం, శివకుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

టీచర్ ఉద్యోగం సాధించిన యువతకు సన్మానం

దుద్యాల, న్యూస్‌టుడే: ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా 2వ ర్యాంక్ సాధించి టీచర్ ఉద్యోగం పొందిన రమేష్‌ను గ్రామ యువకులు ఆదివారం సన్మానం చేశారు. లగచర్ల గ్రామానికి చెందిన కావలి రమేష్ స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రంలో జిల్లా స్థాయి ర్యాంక్ సాధించడం పట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుటి శేఖర్ సత్కరించారు. స్నేహితులు, యువకులు కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించారు

దోమ: దోమ మండలం అనంతరెడ్డిపల్లికి చెందిన నర్సింహారెడ్డి ఇటీవల రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో 22 ర్యాంక్‌సాధించాడు. ఆదివారం గ్రామస్థులు సన్మానించి అభినందించారు.

విద్యుదాఘాతంతో రైతుకు ఆర్థిక నష్టం

దుద్యాల, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన హకీంపేటలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. దగనపురం రమేష్‌కు చెందిన పాడి గేదె నీటి కోసం నియంత్రిక పక్కనే ఉన్న గుంతలోకి వెళ్లింది. అక్కడే కంచె లేని నియంత్రిక తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములు క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని మండల భారాస అధ్యక్షుడు శేరిరాం రెడ్డి అన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలకు ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా సొంత గ్రామాలకు చేరుకుంటారని, ఎన్నో రోజుల తరవాత అందరూ ఒక్క చోట కలుసుకోవడం ఆనందాన్ని ఇస్తోందని చెప్పారు.

ప్రతి మలుపూ.. ప్రమాదకరమే

ఆందోళనలో వాహన దారులు

న్యూస్‌టుడే, బొంరాస్‌పేట: మలుపులు ప్రమాదకరంగా మారాయి. ప్రమాద సూచికలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లకు ఇరువైపులా చెట్లు గుబురుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో మలుపుల వద్ద ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోగా ఎంతోమంది గాయపడ్డారు.

మచ్చుకు కొన్ని..

- బొంరాస్‌పేట నుంచి బురాన్‌పూర్ వెళ్లే రోడ్డులో మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ ఏడాది జనవరిలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. గత నెలలో ఇబ్రహీంపూర్‌తండాకు చెందిన ఓ యువకుడు బైకుపై అతివేగంగా వెళ్తూ మలుపులో అదుపుతప్పి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. వరుసగా ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసులు రోడ్డుకు ఇరువైపులా గుబురుగా పెరిగిన చెట్లను తొలగించారు. కానీ రాత్రి సమయాల్లో వాహనదారులు మలుపును గుర్తించక ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది.
- బొంరాస్‌పేట నుంచి ముద్దాయిపేటకు వెళ్లే రోడ్డులో నమాజ్‌గుట్ట వద్ద కూడా మలుపు ప్రమాదకరంగా ఉంది. చెట్లు గుబురుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో గతంలో ఈ మలుపు వద్ద ఎంతోమంది గాయపడ్డారు.

ఇలా చేస్తే మేలు..

రోడ్డు మలుపుల వద్ద ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలి. రాత్రి సమయాల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లతో సూచికలు ఉండాలి. రోడ్డుకు ఇరువైపులా గుబురుగా పెరిగే చెట్లను ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉంటే ప్రమాదాలను నివారించవచ్చు. అదేవిధంగా రాత్రి సమయాల్లో పోలీసులు డ్రైంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు.



బొంరాస్‌పేట- బురాన్‌పూర్ రోడ్డులో ..

పరిశీలిస్తాం..

ఎక్కడెక్కడ మలుపులు ఉన్నాయన్న దాన్ని పరిశీలిస్తాం. వాటి వద్ద ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలను చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. వాహనదారులు కూడా మలుపుల వద్ద వేగనియంత్రను పాటించాలి. - **ఉమేష్ కుమార్, ఈఈ పీఆర్ విభాగం**

- పాంబండ రహదారి నుంచి బొంరెడ్డిపల్లి మధ్య రెండు చోట్ల మలుపులు ఉన్నాయి. అక్కడే కల్వర్టు ఉంది. దీనికి తోడు ఇటీవలి వర్షాలకు కల్వర్టుకు ఒక వైపు మట్టికోసుకుపోయింది. అసలే మూల మలుపు ఆపై కోసుకుపోతున్న మట్టి దీని వల్ల ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనదారులు ప్రమాదానికి గురికావలసిందేనని పలువురు వాపోతున్నారు.
- కుల్కచర్ల-చాపలగూడెం కుంటకట్ట ఉంది. అదీ ప్రమాదకరంగానే ఉంది. ఇక్కడ కూడా వాహనం అదుపు తప్పితే కుంటలోకి పడిపోవలసిందే. కుస్మసముద్రం- నాగమ్మగడ్డతండా, గండిచెరువు-చౌడాపూర్, బొంపల్లి-బాస్‌పల్లి, శివారెడ్డిపల్లి-బోంపల్లి, పుట్టపహాడ్-కుస్మసముద్రం తదితర చోట్ల మూలమలుపులు ఉన్నాయి. చౌడాపూర్-ఇప్పాయిపల్లి, పాంబండ, చాపలగూడెం కుంటకట్ట తదితర చోట్ల గతంలోనూ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

న్యూస్‌టుడే, కుల్కచర్ల, కుల్కచర్ల గ్రామీణ

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయండి

శంషాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. దసరా సందర్భంగా ఆదివారం శంషాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కొలన్ సుష్మారెడ్డి, శంషాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు నీరటి తన్వీ, చంద్రారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, రాజు తదితరులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటడానికి సమాయత్తం కావాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.



హస్నాబాద్: దుర్గామాతకు బోనాలతో వెళ్లిన మహిళలు



దుద్యాల: దుర్గామాత నిమజ్జన కార్యక్రమంలో యువకులు

అమ్మకు బోనం.. భక్తుల పరవశం



తాండూరు: బోనాల ఉత్సవాల్లో మహిళలతో పురఅధ్యక్షురాలు స్వప్న



మేలంపాటలో రూ.75వేలకు అమ్మవారి చీర..

అమ్మవారి బోనాల ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. స్థానిక మహిళలు ఇళ్లలో బోనాలు తయారు చేసి ఊరేగింపు నిర్వహించారు. మహిళలు, యువతులు కొత్త దుస్తులు ధరించి బోనాలు ఎత్తుకుని ప్రదర్శన చేశారు. అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. ఆదివారం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో దుర్గామాతను ఉంచి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి నిమజ్జనానికి తరలించారు. - **న్యూస్‌టుడే, బృందం**



హస్నాబాద్‌లో రావణ దహనం



దేవతల వేషధారణలో

దసరా ఊరూవాడా సరదా

దసరా పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం దసరా పండగ సందర్భంగా గ్రామాలలో జమ్మిచెట్ల దగ్గరికి గ్రామ పెద్దలు, యువకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి వెళ్లి చెట్ల కొమ్మలను తీసుకువచ్చి బొడ్రాయి దగ్గర ఉంచి పూజాకార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఉత్సవాలలో కులమతాలకు అతీతంగా పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే, బృందం**